క్లుప్తంగా...

విశ్వకర్మ సంక్షేమ సంఘం ఎన్నిక



రామంతాపూర్: శ్రీరామ కాలనీ విశ్వకర్మ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా రవిచారి, ప్రధాన కార్యదర్శిగా మాల్యాల రఘుచారి, కోశాధికారిగా మంత్రి శ్రీనివాస్ చారిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వకర్మ సామాజిక వర్గం సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటేష్ చారి, బాలకృష్ణచారి, రామచంద్రచారి, భిక్షపతిచారి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కుమార్‌కు సాహితీ పురస్కారం



రామంతాపూర్: రామంతాపూర్‌కు చెందిన కవి, రచయిత, సీనియర్ జర్నలిస్టు కోడం పవన్ కుమార్ రచించిన కరోనా లాక్‌డౌన్ అనే వ్యాస సంపుటికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది. పురస్కారం కింద రూ.20,116 నగదును త్వరలో జరిగే ప్రత్యేక వేడుకల్లో ఇచ్చి సత్కరిస్తారు. గతంలో పవన్‌కుమార్‌కు చిన్న నాగయ్య సాహితీ పురస్కారం లభించింది.

బీఎస్పీలోకి సుంకర నరేష్



కుషాయిగూడ: కుషాయిగూడకు చెందిన ప్రముఖ న్యాయవాది, వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకర నరేష్ బీఎస్పీలో చేరారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన మేనిఫెస్టో ఆవిష్కరణ కార్యక్రమంలో బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆయనను ఆహ్వానించారు. సమాజంలో బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయడం కోసమే ఏర్పడ్డ బీఎస్పీలో పార్టీలో చేరడం సంతోషంగా ఉందని నరేష్ అన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ రైల్వే ట్రాక్ సమీపంలో నివసించే నాగప్ప, నర్సింహగౌడ్, పలువురు నాయకులు మంగళవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలతో కాంగ్రెస్‌కి మంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పిట్ల శ్రీనివాస్, వెంకటేష్‌యాదవ్, ఎస్ఆర్.ప్రసాద్, పిట్టల నాగరాజు, శ్రీనివాస్‌యాదవ్, కీర్తి గణేష్, నాగమయ్య, సత్యనారాయణ, బాలరాజుయాదవ్, సంతోష్‌రాందాస్ పాల్గొన్నారు.

మేడ్చల్‌లో పోలీసుల కవాతు

మేడ్చల్‌రూరల్: ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. మంగళవారం మేడ్చల్ పట్టణంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధులు, జాతీయ రహదారి మీదుగా కేఎల్ఆర్ నగర్ వరకు పోలీసులు కవాతు చేశారు. కవాతులో మేడ్చల్‌తో పాటు పలు పోలీస్‌స్టేషన్లను చెందిన పోలీసులు పాల్గొన్నారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు కార్యక్రమం చేపట్టినట్లు ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. సీఐ నర్సింహరెడ్డి, ఎస్ఐలు నవీన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

కృతజ్ఞతలు

మేడ్చల్: నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తోటకూర వజ్రేష్ యాదవ్‌ను ప్రకటించడంతో మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల కొమ్మల నరికివేత కారణంగా బుధవారం మండలంలోని పలు కాలనీలు, గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈలు శశిధర్‌రెడ్డి, పవన్‌చందు తెలిపారు. పట్టణంలోని బ్యాంక్ కాలనీ, మార్కెట్ ప్రాంతం, కింది బస్తీ, చాకలి బస్తీ, బృందావన్‌కాలనీ, ఏకలవ్య నగర్, జ్యోతినగర్, ఆర్టీసీ కాలనీ, సూర్యనగర్, మల్లికార్జుననగర్, రావల్‌కోల్ తండాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.



నృత్యం.. సమ్మోహనం..

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో మంగళవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో భాగంగా సుందరి రవిచంద్ర శిష్య బృందంచే నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. పలు అంశాల్లో తన్వీ, ఆశ్రిత, శ్రియ, బింధు, భవిష్య, అద్విక, కీర్తన, హాసిని ప్రదర్శనలు ఇచ్చారు.

ఉప్పల్ బీజేపీ టికెట్ ఎవరికి..?

ఉప్పల్: ఉప్పల్ బీజేపీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది. ముహూర్తం దగ్గర పడుతున్నా ఇంకా అభ్యర్థిపై స్పష్టత లేకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో గందరగోళం ఏర్పడింది. అన్నా.. ఉప్పల్ టికెట్ ఎవరికి ఇస్తున్నారు అంటూ ఎవరికి వారు ప్రశ్నించుకుంటున్నారు తప్ప పార్టీ వారికి ఇంకా టికెట్ కేటాయింపుపై స్పష్టత రాలేదు. ప్రధాన రాజకీయ పార్టీల్లో సైతం ఇదే చర్చ కొనసాగుతుండటం విశేషం. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ బరిలో ఉన్నా అతడితో పాటు ఇటీవల పార్టీ వీడిన నేతలు, అధికార పార్టీ ఎమ్మెల్యే బీజేపీ ఉప్పల్ సీటు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే పార్టీ అధిష్టానం ఇంకా ఉప్పల్ సీటును ఎవరికీ ఖరారు చేయకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో, రాజకీయ పార్టీల్లో తీవ్ర ఉత్కంఠత నెలకొంది. టికెట్ కేటాయింపులో రేపు, మాపు అంటూ బీజేపీ అధిష్టానం నెట్టుకుంటూ వస్తుందే తప్ప అభ్యర్థుల ఎంపికపై స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని ప్రకటించి దాదాపుగా 60 రోజులు దాటింది. అలాగే ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థిని సైతం ప్రకటించినా ఇంకా బీజేపీ అభ్యర్థి కోసం ఎదురు చూపులే మిగులుతున్నాయని ఆ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అన్ని ప్రధాన పార్టీలు ప్రచారంలో దూసుకుపోతుంటే ఇంకా బీజేపీ అధిష్టానం చోద్యం చూస్తోందని పార్టీ నేతలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

స్ట్రాంగ్‌రూమ్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కూడా సంబంధిత అధికారులపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్ అన్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కూకట్‌పల్లి జేఎన్టీయూలోని పోలింగ్ డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్, రిటర్నింగ్ అధికారి కార్యాలయం, పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవల్ అధికారుల సమన్వయంతో ర్యాంప్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ కోసం సరైన విద్యుత్తు సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనల తర్వాత పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో అన్నీ వసతులు ఉన్నాయని ధ్రువీకరణ నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్‌కు ఎలాంటి అవాంతరాలు జరగకుండా ముందస్తుగా అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రకాశ్, ఈఆర్వో రమేష్, ఎఈఆర్ఓలు, వివిధ శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల్లో జిల్లా సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమని, వారు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన సెక్టోరియల్ అధికారులతో పాటు ప్రతి నియోజకవర్గానికి సంబంధించి 10 మంది చొప్పున మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చామన్నారు. సెక్టోరియల్ అధికారులు ఎన్నికలకు సంబంధించిన శిక్షణ పొందిన తర్వాత వారు జిల్లాలోని పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల శిక్షణలో ఈవీఎంలపై కూడా అవగాహన కల్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా ఎన్నికల శిక్షణ అధికారులు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేశూరామ్, జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి, జెడ్పీ సీఈవో దేవసహాయం, జిల్లాస్థాయి ఎన్నికల శిక్షకులు తిరుమలేష్ పాల్గొన్నారు.

ఉప్పల్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం



ఉప్పల్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తదితరులు

ఉప్పల్: ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఉప్పల్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో, డిక్లరేషన్‌ను ప్రతి ఒక్కరికీ వివరిస్తూ ఓటు వేయాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. ఓల్డ్ భరత్‌నగర్, న్యూ భరత్‌నగర్ ఫేజ్–2 తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, ఏ–బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ, ఈగ అంజయ్య, తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్‌లో చేరా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మల్కాజిగిరి బృందావన్ కాలనీలో కాంగ్రెస్ నేత బోనగిరి సురేష్ యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజల సంక్షేమ కోసం కాంగ్రెస్‌లో చేరానన్నారు. మిర్జాల్‌గూడ చిన్మయ్ మార్గ్‌లో దశాబ్ద కాలంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాని ఆయన అన్నారు. మిర్జాల్‌గూడలో ఎన్నికల తర్వాత సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ ప్రేంకుమార్, కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, సతీష్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, నిమ్మల, ఉపాధ్యక్షుడు పెరుమాల్, డేనియల్, విజయ్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు ఉంటేనే పేదలా..?

మల్కాజిగిరి: రేషన్ కార్డు ఉంటేనే ప్రభుత్వం దృష్టిలో పేదలా అని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రశ్నించారు. ఆర్‌కే నగర్‌లో పోల్కం వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ ఇటీవల ప్రకటించిన మ్యానిఫెస్టో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను కాపీ కొట్టారన్నారు. రేషన్ కార్డు ఉన్నవారికే పథకాలు ఎక్కువగా ప్రకటించారని, కానీ రాష్ట్రంలో రేషన్ కార్డు లేనివారు ఎక్కువ మంది ఉన్నారన్నారు. ప్రభుత్వం ఏళ్ల తరబడి రేషన్‌కార్డులు ఇవ్వకపోవడం, చేర్పులు చేయకపోతే పథకాలు ఎలా అందుతాయన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ ఊసే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సమావేశంలో జీఎన్వీ సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, చెన్నారెడ్డి, వెంకటేష్‌యాదవ్, బీకే శ్రీను, చెన్నారెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

శ్రీపోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



మౌలాలి: గోకుల్‌నగర్‌లో మంగళవారం శ్రీపోచమ్మ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజు హాజరై పూజలు నిర్వహించారు. పూలపల్లి మాధవ్‌యాదవ్, రాము యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, కాశీ విశ్వనాథ్‌యాదవ్, జగదీష్‌యాదవ్, రఘుయాదవ్, పూలపల్లి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదలు, వికలాంగులకు చేయూత



అల్వాల్: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని స్త్రీశక్తి ఫౌండేషన్ చైర్మన్, సినీ నటుడు రాజేంద్రకుమార్ పేదలు, వికలాంగులకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై జీవిస్తున్న పేదలు, వికలాంగులకు ఆయన చేయూత అందజేశారు.

ఆల్ఫోర్స్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని అల్వాల్ హిల్స్‌లోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేస్తూ అలరించారు. మహిళా అధ్యాపక బృందం కూడా బతుకమ్మ ఆట పాటలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి కూడా బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తుంటే ఒక్కసారిగా ప్రాంగణం కేరింతలతో మార్మోగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెతెలు ఫెలోషిప్ చర్చి వార్షికోత్సవం



మౌలాలి: వినాయకనగర్‌లో బెతెలు ఫెలోషిప్ చర్చి 20వ వార్షికోత్సవాన్ని పాస్టర్ సుకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అనంతరం 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో దారా శ్రీనివాస్‌రెడ్డి, ఏవీ శర్మ, ప్రొఫెసర్ వినోద్‌రావు, సెర్ల అనిల్, ఎస్తేరమ్మ, విక్టర్, మెజస్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలు పట్టివేత

కుషాయిగూడ: ఎన్నికల తనిఖీల్లో భాగంగా మంగళవారం కుషాయిగూడ పోలీసులు రూ.20 లక్షల నగదును పట్టుకున్నారు. రాంపల్లి దాయరకు చెందిన కె.హనుమంతరెడ్డి భవానీనగర్ మీదుగా కారులో వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేసి కారులో నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా నిబంధనలకు లోబడి ఉండాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

జంగ్ తెలంగాణ 2023



హెచ్‌బీకాలనీలో బీఎల్ఆర్‌కు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కుషాయిగూడ: ఉప్పల్ ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తానంటూ బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తన ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. మంగళవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మహిళలు ఆయనకు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. కైలాసగిరి, ఇందిరానగర్, లక్ష్మీనగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రచారం చేశారు. స్థానిక బీఆర్ఎస్ నేతలు బోదాసు రవి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, పూస రమేష్ అలివేలు, భారతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



గడప గడప కార్యక్రమంలో వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 7, 8, 9 డివిజన్‌ల్లో నిర్వహించిన గడప గడప కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల బాధలు తెలిసిన వ్యక్తిగా మీ ముందుకు వస్తున్నా.. నన్ను ఆశీర్వదించండి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని పిలుపునిచ్చారు. ఏడో రోజు గడప గడప కార్యక్రమంలో ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్‌గౌడ్, విశ్వంగుప్తా, నేతలు బొమ్మక్ రమేష్, హరినాథ్‌రెడ్డి, తోటకూర అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం



ఏకలవ్యనగర్‌లో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఏకలవ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏకలవ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మర్రి రాజశేఖర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్‌తో కలిసి హాజరయ్యారు. ఎన్నికల తర్వాత కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీకి చెందిన చిట్టిబాబు తన బృందంతో బీఆర్ఎస్‌లో చేరారు. ఏకవల్యనగర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, స్థానిక నాయకులు మేకల రాము యాదవ్, వేణునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలిస్తేనే మల్కాజిగిరిలో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్

గౌతంనగర్: వ్యక్తిగత స్వార్థంతో ప్యారాచ్యూట్‌తో వచ్చిన వ్యక్తికి కాంగ్రెస్ పార్టీలో మల్కాజిగిరి టికెట్ ఇచ్చారని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందకంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని వాణీనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన స్థానిక కార్పొరేటర్ మేకల సునీతయాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మేకల రాముయాదవ్, వేణునాయుడు, పీవీ సత్యనారాయణ, సిద్ధి రాములు, క్రిష్ణగౌడ్, నర్సింగ్, మల్లేష్ యాదవ్, కిట్టు, కాటం రాజు, భిక్షపతి, నగేష్‌గౌడ్, భాగ్యవతి, షేక్ పాల్గొన్నారు.

బండారి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం



చిలుకానగర్ బీరప్పగడ్డలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఉప్పల్: ఉప్పల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అన్నారు. చిలుకానగర్ డివిజన్ పరిధిలోని బీరప్పగడ్డలో ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బండారి లక్ష్మారెడ్డితోనే ఉప్పల్ అభివృద్ధి చెందుతుందన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

మల్కాజిగిరి: ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యంగా పనిచేస్తుందని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ జవహర్‌నగర్, ఏపీఐఐసీ కాలనీ, శ్రీనగర్ కాలనీ, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగరావు, ఉపేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

ప్రజల్లో చైతన్యం నింపుతూ.. గెలుపు దిశగా సాగుతూ..



కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని గెలుపుబాటలో నిలిపేందుకు అంతా కంకణబద్ధులై పనిచేయాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం తన కార్యాలయంలో డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆమె ప్రచారశైలిపై కార్యచరణ చేపట్టారు. డివిజన్‌లో ప్రతి గడపకు తిరుగుతూ ప్రచారం సాగించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మ్యానిఫెస్టో అంశాలపై ప్రజలను చైతన్య పరిచి కారు గుర్తుకు ఓటు వేసేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ దిశగా ముందుకు సాగుతూ బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, విద్యాసాగర్, జౌండ్ల సత్తిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హరివర్ధన్‌రెడ్డిని బుజ్జగించిన మైనంపల్లి



మీడియాతో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

మేడ్చల్: మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో అసమ్మతితో ఉన్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని మల్కాజిగిరి ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంత్‌రావు, నియోజకవర్గ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి బోయిన్‌పల్లిలోని హరివర్ధన్ రెడ్డి నివాసానికి వెళ్లి సమావేశమయ్యారు. పార్టీ అధికారంలోకి వస్తుందని భవిష్యత్‌లో న్యాయం చేస్తామని ఆయన హరివర్ధన్‌కు నచ్చజెప్పారు. సమష్టిగా పనిచేసి మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

మల్లు రవి మంతనాలు..

అలకబూనిన హరివర్ధన్‌రెడ్డిని బుజ్జగించేందుకు టీపీసీసీ తరఫున మల్లు రవి రంగంలోకి దిగారు. మల్లు రవి నేరుగా బోయిన్‌పల్లిలోని హరివర్ధన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఇంట్లో రహస్యంగా సమావేశం నిర్వహించారు. టికెట్ విషయంలో అన్యాయం జరిగినా పార్టీ తగిన సమయంలో గౌరవం ఇస్తుందని పార్టీ గెలుపుకోసం కష్టపడాలని సూచించారు.